
సాక్షి అనంతపురం

సోమవారం । 16 । జూన్ । 2025



తల్లికి వందనం.. అవుట్

స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్ల పిల్లలకు 'తల్లికి వందనం' పథకం వర్తించదని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. 8లో



కాసులు కొడితేనే ఎఫ్‌సీ

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మంజూరులో దందా సాగుతోంది. ఏజెంట్లతో కుమ్మక్కై అందినకాడికి దోచుకుంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.9°/23.7°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు యాడికిలో 'పరిష్కార వేదిక'



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ (ఫైల్)

అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం యాడికి మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. యాడికి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

యోగాతో మానసికోల్లాసం



యోగా సాధన చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి రూరల్: యోగాతో మానసికోల్లాసం లభిస్తుందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత చింతల వెంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన 'యోగాంధ్ర'లో కలెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు ఆలయ ప్రధాన అర్చకులు మురళిస్వామి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చరిత్ర, రామాయణ, మహాభారత గ్రంథాల సారాంశంతో కూడిన శిల్పకళను చూసి కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను కలెక్టర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్‌కు స్వామి వారి వస్త్రం, చిత్రపటాన్ని అర్చకులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా టూరిజం అధికారి జయకుమార్, యోగా గురువు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

18న 'దిశ' సమావేశం

అనంతపురం సిటీ: దిశ (జిల్లా సమన్వయ - అభివృద్ధి) కమిటీ సమావేశం ఈ నెల 18న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉదయం 11 గంటలకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరగనుంది. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు, దిశ కమిటీ సభ్యులు లేవనెత్తిన అంశాలు, వాటికి సంబంధించి తీసుకున్న చర్యలపై సమగ్ర వివరాలతో అధికారులు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రతి మూడు నెలలకోసారి దిశ కమిటీ సమావేశాలు నిర్వహించాలని చట్టం చెబుతున్నా.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలి సమావేశం అక్టోబర్ 29న నిర్వహించారు. ఆ తరువాత సమావేశం నిర్వహణను గాలికి వదిలేశారు. ఎంపీ, కలెక్టర్ ఇద్దరికీ తీరిక లేకపోవడంతో ఈ సమావేశాలు నిర్వహించలేకపోయినట్లుగా సమాచారం. ఇక శ్రీసత్యసాయి జిల్లా విషయానికొస్తే.. డిసెంబర్ 31న పుట్టపర్తి రెవెన్యూ భవన్‌లో దిశ కమిటీ సమావేశాన్ని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అధ్యక్షతన నిర్వహించారు. ఆ తర్వాత ఇప్పటి వరకూ సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు.

బాధ ఉన్నా.. బాగు కోసం

అనంతపురం వేణుగోపాల్ నగర్‌కు చెందిన శ్రీలత ప్రభుత్వ టీచర్. భర్త ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరి కుమారుడు 7వ తరగతి చదువుతున్నాడు. రెండేళ్ల నుంచి కర్నూలులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఉంచి చదివిస్తున్నారు. పిల్లాడు ఇంట్లో చేసే అల్లరి భరించలేక కర్నూలులోని స్కూల్లో వేయాల్సి వచ్చిందని శ్రీలత చెబుతున్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన మహబూబ్‌బీ గృహిణి. భర్త పోస్టల్ శాఖలో పనిచేస్తారు. వీరికి ఇద్దరు కొడుకులైతే.. ఇద్దరినీ తిరుపతిలోని ఓ రెసిడెన్షియల్ స్కూల్లో ఉంచి చదివిస్తున్నారు. ఇంట్లో ఉంటే తమ మాట వినరు కాబట్టి హాస్టల్లో వేశాం అని దంపతులు తెలిపారు.



- పిల్లలను ఇంట్లో భరించలేక హాస్టళ్లకు పంపుతున్న తల్లిదండ్రులు
- తప్పని పరిస్థితుల్లో దూర ప్రాంతాల్లో వదులుతున్న వైనం
- ప్రస్తుతం సాధారణ రెసిడెన్షియల్ స్కూల్‌కూ ఏడాదికి రూ. ఒకటిన్నర లక్ష పైనే ఫీజు
- ఆర్థికంగా కుదేలవుతున్న మధ్యతరగతి కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తల్లిదండ్రులకు పిల్లలంటే ఎంత ఇష్టమో ఊహించలేం. అలాంటిది ఇటీవల కాలంలో పిల్లలు ఇంట్లో నుంచి ఎప్పుడు బయటకు వెళ్తారా అని వేచిచూస్తున్న పరిస్థితి. బిడ్డల అల్లరిని తల్లిదండ్రులు నియంత్రించలేకపోతున్నారు. గారాబం కాస్త ఎక్కువ కావడంతో పిడుగుల్లా మారుతున్నారు. ఈ క్రమంలో చేసేది లేక పిల్లల్ని హాస్టళ్లలో వదులుతున్నారు. బాధను దిగమింగుకుని బిడ్డ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయం తీసుకుంటున్నారు.

ఆర్థికంగా భారమైనా..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాదిమంది తల్లిదండ్రులు తమ పిల్లలను రెసిడెన్షియల్ ప్రైవేటు స్కూళ్లలో వేస్తున్నారు. తమ తాహత్తుకు మించి ఫీజులున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటుకు తరలిస్తున్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మధ్యతరగతి, పేద కుటుంబాలే ఎక్కువ. ఈ పరిస్థితుల్లో 6వ తరగతి నుంచే పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివిస్తుండడం ఆర్థికంగా ఆయా కుటుంబాలను చిదిమేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని రెసిడెన్షియల్ ప్రైవేటు పాఠశాలల్లో ఆరో తరగతి విద్యార్థికి అన్నీ కలిపి రూ.80 వేల నుంచి రూ.1.20 లక్షలకు తక్కువ ఎక్కడా లేదు. డే స్కాలర్ స్కూళ్లలోనూ ఏడాదికి పుస్తకాలతో కలిపి రూ.60 వేల నుంచి రూ.80వేల వరకూ ఉంది. గుడివాడ లాంటి ప్రాంతాలకు రూ.2.50 లక్షలు చెల్లించి పంపిస్తున్న కుటుంబాలూ ఉన్నాయి. ఫీజుల భారం ఇంతలా ఉన్నా.. ఇంట్లో ఉంటే చదవడం లేదని, అప్పు చేసి అయినా హాస్టళ్లలో వేయాలని తల్లిదండ్రులు అనుకుంటున్నారు. పదో తరగతిలోపే ఒక్కో విద్యార్థిపై రూ.10 లక్షల దాకా ఖర్చు పెడుతున్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు అప్పుల్లో కూరుకు

ఉమ్మడి జిల్లాలో 6 నుంచి 10వ తరగతి వరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో చేరుతున్న వారు	
అనంతపురం జిల్లాలో	18,000 వరకు
శ్రీ సత్యసాయి జిల్లాలో	11,000 వరకు
మొత్తం విద్యార్థులు	29,000 వరకు
ఒక్కొక్కరికి సగటున	రూ.80,000-రూ.1,20,000 వరకు
మొత్తమ్మీద సగటున ఏడాదికి	రూ.250 కోట్ల వరకు

పోతున్నాయి. ఒక రకంగా సామాన్యులను ఈ ఫీజులు కోలుకోలేకుండా చేస్తున్నాయి.

మొబైల్ బంధంతోనే అనర్థాలు..

చిన్నారులు మొబైల్‌కు బానిసలుగా మారుతుండడం తల్లిదండ్రులను దిక్కుతోచని స్థితిలోకి నెడుతున్నట్లుగా తెలుస్తోంది. నాల్గో తరగతి నుంచే పిల్లల చేతికి మొబైల్ ఫోన్‌లు ఇవ్వడం, వాళ్లు దాన్ని జీవితంలో భాగం చేసుకోవడం విపరీత పరిణామాలకు దారి తీస్తోంది. 70 శాతం విద్యార్థులు మొబైల్ వ్యసనంతోనే తల్లిదండ్రులను ఖాతరు చేయడం లేదు.

హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నాం



అనంతపురం సాయి నగర్‌లో హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నా. ఇంట్లో పిల్లలు ఎప్పుడూ సెల్‌ఫోన్ మాయలోనే ఉంటున్నారు. అందుకే మా అక్క పిల్లలతో పాటు బంధువుల పిల్లలనూ హాస్టల్‌లో పెట్టి చదివిస్తున్నాం.
– మమత, సోదనపల్లి, శింగనమల మండలం

ఖర్చయినా తప్పట్లేదు



నాకు ముగ్గురు పిల్లలు. ఇంట్లో ఉంటే చదవడం లేదు. దీంతో చిన్నప్పటి నుంచే అనంతపురంలో రెసిడెన్షియల్ స్కూల్లో వేశా. ఖర్చయినా వారి బాగు కోసమే హాస్టళ్లలో ఉంచి చదివిస్తున్నా.
–బసవ, నేమకల్లు, బొమ్మనహాళ్ మండలం

పల్లెలో చదివించడం కష్టం



నాకు ఒక అమ్మాయి. అనంతపురంలో హాస్టల్ ఉన్న స్కూల్లో 10 వరకూ చదివించాను. ఇప్పుడు ఇంటర్‌కు కూడా హాస్టలున్న కళాశాలలోనే వేస్తున్నాను. పల్లెలో చదివించడం కష్టంగా ఉంది.
– సుజాత, పుట్లూరు మండలం

ముగిసిన టీచర్ల బదిలీలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. చివరి రోజు ఎక్కువమంది టీచర్లు 'నాట్ ఆప్టెడ్' ఆప్షన్ ఇచ్చారు. మొత్తం 1,003 మంది టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్జీటీ తెలుగుకు సంబంధించి అందరూ రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్న వారే కావడంతో కౌన్సెలింగ్ ప్రక్రియ స్పీడుగా సాగింది. తెలుగు తర్వాత కన్నడ (19 ఖాళీలు), ఉర్దూ (104) ఎస్జీటీ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రికి ఉత్తర్వులు జనరేట్ అవుతాయని, సోమవారం కొత్త స్కూళ్లలో చేరాలంటూ డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు పాటించని టీచర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

వెబ్ ద్వారానే మునిసిపల్ టీచర్ల బదిలీలు..

మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేశారు. వీటిపై సందిగ్ధం నెలకొన్నా...మధ్యాహ్నానికి రాష్ట్ర అధికారులు స్పష్టత ఇచ్చారు. ఆన్‌లైన్‌లో ఉత్తర్వులు జనరేట్ చేయడంతో వారంతా సాయంత్రానికి పాత స్కూళ్లలో రిలీవ్ అయ్యారు.

పండిట్ల బదిలీ తికమక..

భాషా పండితుల (ఉర్దూ) బదిలీల్లో తికమక చోటు చేసుకుంది. తనకల్లులో పని చేస్తున్న కె.ఆఫ్రిన్ సీనియార్టీ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నారు. హిందూపురంలో పని చేస్తున్న షేక్ అస్మాభాను రెండోస్థానంలో ఉన్నారు. వెబ్ ఆప్షన్లలో కె.ఆఫ్రిన్ తనకల్లు పాఠశాల, అస్మాభాను హిందూపురం పాఠశాల పెట్టుకున్నారు. ఉత్తర్వుల్లో మాత్రం ఆఫ్రిన్‌కు హిందూపురం, అస్మాభానుకు తనకల్లు పాఠశాల కేటాయించారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగి ఉంటుందని, ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామన్నారు. కాగా ఎల్‌పీటీ బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్నా స్కూల్ అలాట్ కాలేదంటూ ఓ టీచరు పరిశీలకులు సుబ్బారావు దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అందరికీ ధన్యవాదాలు

వేల సంఖ్యలో జరిగిన టీచర్ల బదిలీలకు సంబంధించిన ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పరిశీలకులు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు ధన్యవాదాలు తెలిపారు. సిబ్బంది, సాంకేతిక నిపుణులను అభినందించారు.

హామీలన్నీ నెరవేర్చే వరకు పోరాటాలు ఆగవు

- ఏడాదిలో రూ.81 వేల కోట్లు ప్రజలకు బాకీ పడిన చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత
- 'జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ



'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ నేతలు

అనంతపురం కార్పొరేషన్: 'అలవిగాని హామీలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేస్తుంటే చూస్తూ ఊరుకోం. ప్రజల పక్షాన నిలబడతాం. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు పోరాటాలు ఆగవు. ప్రభుత్వ మెడలు వంచైనా పథకాలు అమలు చేసేలా ఒత్తిడి తీసుకువస్తాం' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'అనంత' మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్న సమయంలో అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా ప్రజలకు రూ.2.81 లక్షల కోట్లు అందించారన్నారు. ఏడాది బాబు పాలనలో కేవలం సూపర్ సిక్స్ పథకాల ద్వారా రూ.81 వేల కోట్లు ప్రజలకు ఇవ్వాల్సి ఉందని, ఆ బాకీ తీర్చే వరకు తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో పోరాటాలు చేస్తామన్నారు. 2014–19లోనూ ప్రజలను బాబు వంచించారన్నారు. వైఎస్సార్ సీపీ పోరాటాలు చేయడంతోనే 'తల్లికి వందనం' నిధులు విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో 67 లక్షల మంది అర్హులుంటే అందులో 37.70 లక్షల మందికే పథకం వర్తింపజేశారని, మిగిలిన వారికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ ప్రభుత్వంలో 'అమ్మ ఒడి' నిధుల నుంచి రూ.2 వేల చొప్పున పాఠశాల అభివృద్ధికి కేటాయిస్తే జే ట్యాక్స్ అంటూ దుష్ప్రచారం చేసిన చంద్రబాబు అండ్ కో... ఇవాళ అదే పద్ధతిలో రూ.13,000 మాత్రమే ఇస్తోందని దుయ్యబట్టారు. 'అన్నదాత సుఖీభవ', 'ఆడబిడ్డ నిధి', 'ఉచిత బస్సు ప్రయాణం' అమలు చేయకుండా జాప్యం చేయడం దారుణమన్నారు.

ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే దోపిడీ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో పోలీసులు, రెవెన్యూ శాఖ ప్రేక్షకపాత్ర పోషించడంతో ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో మద్యం, ఇసుక, మట్టి దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందని 'అనంత' విమర్శించారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అనంతపురంలో మద్యం షాపులు, బార్లు, లాడ్జీల్లోకి వెళ్లి దౌర్జన్యం చేసే దారుణమైన పరిస్థితుల్లో పాలకులు ఉన్నారన్నారు. మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయించుకోవాలని, ప్రతి నెలా తమకు ఒక్కో షాపు నుంచి రూ.70,000 ఇవ్వాలని ప్రజాప్రతినిధులే డీల్ చేసుకున్నారని ధ్వజమెత్తారు. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే పేదలను సంత మార్కెట్ పేరుతో పీల్చి పిప్పిచేస్తున్నారన్నారు. రూ.10 రుసుం వసూలు చేసే చోట రూ.20 నుంచి రూ.40, రూ.50, రూ.100 దండుకుంటూ దోపిడీ చేస్తున్నారన్నారు. నగరపాలక సంస్థకు కేవలం రూ.5 లక్షలు చెల్లిస్తూ..ప్రతి నెలా రూ.లక్షల్లో లాగేసుకుంటున్నారన్నారు. మార్కెట్ యార్డులోనూ ఇదే తరహా దోపిడీ జరుగుతోందన్నారు. ఆదాయం ఎవరి జేబుల్లోకి వెళ్తోందని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, శ్రీనివాస్ నాయక్, మల్లెమీద నరసింహులు, చంద్రశేఖర్ యాదవ్, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, ఓబిరెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి మారుతీనాయుడు, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అశ్వర్థనాయక్, నాయకులు వెన్నం శివరామిరెడ్డి, గోయింద్ నాయక్, కొర్రపాడు హుస్సేన్ పీరా, రాజారత్నం, రంగారెడ్డి, మీసాల రంగన్న, తనీష, దాదు, దత్తా, అనిల్‌కుమార్ గౌడ్, పెన్నోబులేసు, చామలూరు రాజగోపాల్, కేశవరెడ్డి, కృష్ణవేణి, హరిత, సాకే చంద్రలేఖ, దేవి, విజయశాంతి, భారతి, ఉష, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


ఖరీఫ్‌కు 1.07 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు

- అత్యధికంగా 53,446 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్



అనంతపురం అగ్రికల్చర్: ఈ ఖరీఫ్‌లో జిల్లాకు 1,07,302 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక రచించారు. 4.38 లక్షల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగులోకి రావొచ్చని అంచనా వేశారు. ఎరువుల ప్రతిపాదనలకు కమిషనరేట్ నుంచి అనుమతులు లభించినట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కంపెనీల వారీగా ఎరువుల కోటా టార్గెట్లు విధించారు. అలాగే నెలవారీగా అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. సెప్టెంబర్‌తో ముగిసే ఖరీఫ్ కాలానికి 1,07,302 మెట్రిక్ టన్నులు అవసరమని ఎరువుల ప్రణాళిక తయారు చేశారు. అందులో అత్యధికంగా వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువులు 53,446 మెట్రిక్ టన్నులు కాగా 26,839 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయనున్నారు. అలాగే 18,261 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,735 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ), సింగిల్ సూపర్ పాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ) 4,021 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని తెలిపారు. ఇండెంట్ మేరకు కంపెనీలు, మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్ఎస్‌కేలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీ), రిటైల్, హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే 40 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. 15 వేల మెట్రిక్ టన్నుల చొప్పున కాంప్లెక్స్, యూరియా ఉండగా, 3 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 6 వేల మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 2 వేల మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.

మొరాయించిన తిరుపతి ప్యాసింజర్ రైలింజిన్



గూళ్యపాళ్యం స్టేషన్‌లో ఆగిపోయిన తిరుపతి ప్యాసింజర్ రైలు

గుంతకల్లు: గుంతకల్లు–తిరుపతి ప్యాసింజర్ (57403) రైలింజిన్ మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంతకల్లు జంక్షన్ నుంచి ఈ రైలు ఉదయం 8.09 గంటలకు బయలుదేరింది. హనుమాన్ సర్కిల్ రైల్వేస్టేషన్ దాటుకుని గూళ్యపాళ్యం రైల్వేస్టేషన్‌కు (8.35 గంటలకు) చేరుకోగానే రైలింజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తి నిలబడిపోయింది. లోకోపైలట్, అసిస్టెంట్ లోకోపైలట్ ఎంత ప్రయత్నించినా రైలు ముందుకు కదలకపోవడంతో గుంతకల్లులోని కంట్రోల్ ఆఫీసుకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారులు గుంతకల్లు నుంచి మరో రైలింజిన్‌ను గూళ్యపాళ్యం రైల్వేస్టేషన్‌కు పంపారు. రైలుకు దాన్ని జత చేసి ముందుకు సాగనంపారు. ఈ క్రమంలో గంటన్నరకు పైగా ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆర్డీటీని పరిరక్షించుకుందాం

- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి
- తలారి రంగయ్య ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు సంఘీభావం



తలారి రంగయ్యకు పట్టువస్త్రం, ప్రసాదాలు అందజేస్తున్న రఘువీరారెడ్డి



ఆర్డీటీ ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ కంటతడి పెట్టిన మహిళ

కళ్యాణదుర్గం: ఆర్డీటీ పరిరక్షణకు మాజీ ఎంపీ తలారి రంగయ్యతో కలిసి నడుద్దామని పీసీసీ మాజీ అధ్యక్షుడు, సీడబ్ల్యూసీ సభ్యుడు డాక్టర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ, పార్టీ పీఏసీ సభ్యులు డాక్టర్ తలారి రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు ఆదివారం కళ్యాణదుర్గం మండలం బాలవెంకటాపురం గ్రామంలో రఘువీరారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క బాల వెంకటాపురం గ్రామంలోనే 70 కుటుంబాలు ఆర్డీటీ ద్వారా లబ్ధి పొందాయన్నారు. 40 ఇళ్లు ఆర్డీటీ నిర్మించిందన్నారు. ఆర్డీటీని కాపాడటం కోసం పాదయాత్ర చేయాల్సి వస్తుందని తలారి రంగయ్య ముందే చెప్పారని గుర్తు చేసుకున్నారు. పేద ప్రజలకు ఆర్డీటీ ఫలాలు ఆగకూడదన్నారు. ప్రభుత్వాలు కూడా చేయలేని ఎన్నో పనులను ఆర్డీటీ చేసిందన్నారు. ఆర్డీటీ అంశాన్ని ఎవరూ రాజకీయాల్లోకి లాగొద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్డీటీ ఆసుపత్రులు మూతపడితే పేదలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. తలారి రంగయ్య పాదయాత్ర 220 కిలోమీటర్ల మేర జరుగుతుందని, ఇది ప్రజల్లో అవగాహన కల్పించడానికి చేపట్టిన కార్యక్రమమని చెప్పారు. ఆర్డీటీ ద్వారా అత్యధికంగా లబ్ధి పొందింది కళ్యాణదుర్గం నియోజకవర్గ వాసులేనన్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు రంగయ్య పాదయాత్ర నిర్ణయం తీసుకున్నారని, ఆయన సంకల్పం నెరవేరాలని ఆకాంక్షించారు. పాదయాత్రకు రాజకీయాలకు అతీతంగా నాయకులు, ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్నారు. ఆర్డీటీ విషయమై త్వరలోనే ఢిల్లీకి వెళ్తానని, ప్రధాన మంత్రితో పాటు కేంద్ర హోంమంత్రిని పార్టీ పెద్దలతో కలిసి కలుస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం తన స్వగ్రామం నీలకంఠాపురంలోని ఆలయాల్లో పూజలు చేయించిన పట్టువస్త్రంతో పాటు ప్రసాదాలను తలారి రంగయ్యకు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'పచ్చ' నేతల అక్కసు



బాల వెంకటాపురంలో రాత్రికి రాత్రే వెలసిన టీడీపీ ఫ్లెక్సీలు

కళ్యాణదుర్గం: టీడీపీ నేతలు ఆర్డీటీపై కూడా తమ అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర శనివారం రాత్రి బాల వెంకటాపురం గ్రామానికి చేరుకుంది. ఈ క్రమంలో కార్యక్రమాన్ని అడ్డుకోవాలని టీడీపీ నాయకులు కుయుక్తులు పన్నారు. గ్రామంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య బస చేస్తున్న ప్రాంతానికి సమీపంలోనే నీచ రాజకీయాలకు తెర లేపారు. 'తల్లికి వందనం' లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేపడుతున్నట్లు హడావుడి చేశారు. రాత్రికి రాత్రే గ్రామంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

మొదటి నుంచీ అంతే..

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యువల్ కోసం మాజీ ఎంపీ తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్రను అడ్డుకునేందుకు టీడీపీ నేతలు కుయుక్తులకు తెరతీశారు. పాదయాత్ర ప్రారంభంలో గొంచి తండాలో తలారి రంగయ్యను పోలీసులతో అరెస్టు చేయించాలని శతవిధాలా ప్రయత్నించారు. అయితే అక్కడ ప్రజలు చైతన్యవంతులై పాదయాత్రకు రక్షణగా నిలవడంతో వారి ఆటలు సాగలేదు. ఆ తర్వాత బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లిలో పాదయాత్రను అడ్డుకునేందుకు ఏకంగా 'పచ్చ మూకలు' రోడ్డుపై బైఠాయించాయి. ఏ మాత్రం బెదరని రంగయ్య ఆర్డీటీ కోసం సడలని సంకల్పంతో ముందుకువెళ్లడంతో తోకముడిచారు. తాజాగా బాల వెంకటాపురం గ్రామంలో కుట్రలకు తెరతీయడం గమనార్హం.

భారీగా పోలీసు బందోబస్తు..

రంగయ్య పాదయాత్రను అడ్డుకునేందుకు టీడీపీ నేతలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలుసుకున్న పోలీసులు గ్రామంలో బందోబస్తు చేపట్టారు. డీఎస్పీ రవిబాబు, సీఐలు వంశీకృష్ణ, నీలకంఠేశ్వరలతో పాటు పదుల సంఖ్యలో పోలీసులు పహారా కాశారు. ఈ క్రమంలోనే మాజీ ఎంపీ రంగయ్య పాదయాత్ర షెడ్యూల్ ఉదయం 10 గంటలకు ఉన్నా టీడీపీ నేతల ఒత్తిళ్లతో రంగయ్యను ఉదయం 8 గంటలకే బస చేసే ప్రాంతం నుంచి బయలుదేరాలని కోరారు. ఆర్డీటీ కోసం చేస్తున్న పాదయాత్రను కూడా ఓర్వలేకపోవడంపై రంగయ్య అసహనం వ్యక్తం చేశారు. పాదయాత్రను అడ్డుకునేందుకు కుట్రలు పన్నడం సరికాదని పలువురు మహిళలు హితవు పలికారు.

క్లుప్తంగా

ఖనిజ నిక్షేపాల గుర్తింపునకు సర్వే

పుట్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా ఖనిజ నిక్షేపాల గుర్తింపునకు ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో సర్వే చేస్తున్నారు. పుట్లూరు, గోపురాజుపల్లి, వెంగన్నపల్లి, శనగలగూడూరు, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో 2023 మే, జూన్ నెలల్లో వందలాది బోరుబావులను తవ్వి సర్వే చేపట్టిన విషయం విధితమే. ప్రస్తుతం శనగలగూడూరు, తక్కళ్లపల్లి, పుట్లూరు గ్రామాల్లో బోరుబావులను తవ్వడంతో పాటు అరకటివేముల, ఏ.కొండాపురంలో సర్వేను ప్రారంభించారు. బోరుబావులను తవ్వి నియంత్రిత పేలుళ్ల ద్వారా తరంగాలను సృష్టించి భూమిలో నిక్షేపాల వివరాలను అధునాతన సాంకేతిక పద్ధతిలో నమోదు చేస్తున్నారు.

ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా రామ్మోహన్‌రెడ్డి



అనంతపురం: ఏపీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ బి.రామ్మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం ఏపీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో 100 ఓట్లకు గాను 73 ఓట్లతో ఉపాధ్యక్షుడిగా రామ్మోహన్‌రెడ్డి గెలుపొందారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ఎం. ఆదిశేషు ఓ ప్రకటన విడుదల చేశారు.

తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో 2014–25 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన తొగటవీర క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. జూలై 10వ తేదీలోపు దరఖాస్తులను అనంతపురంలోని విజయనగర కాలనీలో ఉన్న శ్రీచౌడేశ్వరి కళ్యాణమంటపంలో అందజేయాలి. పదో తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం జతపరచాలి. అర్హులైన వారికి జూలై 24న నగదు పురస్కారాలతో సత్కరించనున్రానను. పూర్తి వివరాలకు 85559 67072, 94408 7848, 99083 15014, 70321 16490లో సంప్రదించవచ్చు.

కాసులు కొడితేనే ఎఫ్‌సీ

అనంతపురం నగర శివారులో బళ్లారి జాతీయ రహదారిలో ఓ ప్రైవేటు స్కూల్‌కు సంబంధించిన ఐదు బస్సులు ఇటీవల ఫిట్‌నెస్ టెస్ట్ కోసం ఏజెంట్ ద్వారా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌కు వెళ్లాయి. ఎఫ్‌సీ గడువు సంవత్సరానికి అయితే రూ. 3 వేలు, రెండు సంవత్సరాలకైతే రూ. 4,500 చొప్పున వసూలు చేశారు. గతంలో రూ.2,500 మాత్రమే ఇచ్చేవారమని, ఇప్పుడు డబుల్ ఎందుకు వసూలు చేస్తున్నారని సదరు ఏజెంట్‌తో స్కూల్ నిర్వాహకులు గొడవకు దిగితే.. అంత డబ్బులు ఇస్తేనే బస్సులు పాస్ అవుతాయని చెబితేనే తీసుకున్నానని, తనకేం సంబంధం లేదని అతను తెలిపాడు.

గత గురువారం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ఓ లారీ డ్రైవర్ ఏటీఎస్ కేంద్రానికి వచ్చాడు. అన్ని సక్రమంగా ఉండడంతో ఏజెంట్ ద్వారా కాకుండా నేరుగా వచ్చాడు. ఇక్కడికి వచ్చిన వెంటనే లారీని పరీక్షించిన ఏటీఎస్ నిర్వాహకులు ఇంజిన్ స్పీడ్ ఎక్కువగా ఉంది.. మరమ్మతులు చేసుకొని రావాల్సిందేనని హుకుం జారీ చేశారు. దాదాపు రూ. 20 వేలు ఖర్చు కావడంతో పాటు చలానాలు తిరిగి మళ్లీ కట్టాల్సి వచ్చింది. శుక్రవారం సర్వర్ పనిచేయలేదని, శనివారం బక్రీద్, ఆదివారం సెలవు కావడంతో మూడురోజులు ఆలస్యం కావడంతో వారు అడిగినంత ఇచ్చి ఉండే బాగుండునని బాధిత డ్రైవర్ నిట్టూర్చాడు.


ఏటీఎస్ కేంద్రంలో ఫిట్‌నెస్ టెస్ట్‌లు చేస్తున్న దృశ్యం


ఫిట్‌నెస్ టెస్ట్ కోసం ఏటీఎస్ కేంద్రానికి వచ్చిన వాహనాలు

- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ముసుగులో దందా
- ఏటీఎస్ కేంద్రం నిర్వాహకులు, ఏజెంట్ల మిలాఖత్
- వాహనాన్ని బట్టి సప'రేటు'
- పైసలు ముట్టచెబితేనే ఫిట్‌నెస్ టెస్ట్‌లో పాస్
- లేకపోతే మరమ్మతుల పేరుతో ఇబ్బందులు

అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాదాల నియంత్రణ, పారదర్శకమైన సేవల కోసం వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ మంజూరు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. ప్రతి జిల్లాకొక ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లను నెలకొల్పారు. జిల్లాకు సంబంధించి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు టెండర్ ద్వారా దక్కించుకున్నారు. నగర శివారు ప్రసన్నాయపల్లి జాతీయ రహదారి పక్కన గత కొన్ని నెలలుగా ఫిట్‌నెస్ టెస్ట్‌లు చేస్తున్నారు. అయితే దీనిపై ఆర్టీఏ అధికారులకు ఎలాంటి అజమాయిషీ లేకపోవడంతో అక్రమాలకు తెరలేపారు. కొద్దిరోజుల పాటు స్తబ్ధుగా ఉన్న ఏజెంట్లు తిరిగి వారి కార్యకలాపాలను ఆర్టీఏ కార్యాలయం నుంచి ఏటీఎస్ (ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్)కు మార్చారు.

డబ్బులు ముట్టజెబితేనే పాస్..

ఏటీఎస్ కేంద్రం నిర్వాహకులు, ఏజెంట్లు కుమ్మక్కై వాహనదారుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వాహనాన్ని బట్టి ఫిక్స్ చేసిన ధరల ప్రకారం డబ్బు ముట్టజెబితేనే పాస్ చేస్తున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. లేదంటే మరమ్మతులు చేసుకొని రండి అంటూ నిర్మొహమాటంగా చెబుతున్నారు. ఈ క్రమంలో చలానా మళ్లీ కట్టాల్సి వస్తుండటంతో వాహనదారులపై భారం పడుతోంది. గతంలో ఆర్టీఏ కార్యాలయ పరిధిలో ఉన్నప్పుడు ఒకసారి చలానా కడితే ఫెయిల్ అయినా మరుసటి రోజుకు రూ.10తోనే చలానా రెన్యూవల్ చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ సదుపాయం తొలగించడంతో వాహనదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఏజెంట్లతో కుమ్మక్కు...

జిల్లా వ్యాప్తంగా 65 వేల పైచిలుకు ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఉన్నాయి. గతంలో అనంతపురంతో పాటు తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ పరీక్షలు జరిగేవి. కానీ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేసిన తర్వాత జిల్లా నలుమూలల నుంచి వాహనాలు అనంతపురం రావాల్సి వస్తోంది. దీంతో 'ఏటీఎస్' నిర్వాహకులు, ఆయా ప్రాంతాల్లో ఏజెంట్లు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఏజెంట్ ద్వారా వచ్చే వాహనాలకు సంబంధించిన వివరాలను వాట్సాప్ ద్వారా 'ఏటీఎస్' నిర్వాహకులకు ముందే తెలియజేస్తారు. పని పూర్తయ్యాక డబ్బును ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా పంపుతున్నట్లు సమాచారం. డబ్బుల సేకరణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. 'ఏటీఎస్'లో పనిచేస్తున్న ఓ మహిళ, పురుషుని ఫోన్‌పే ఖాతాలు పరిశీలిస్తే నిత్యం ఎంత కొల్లగొడుతున్నారో తెలిపోతుందని పలువురు పేర్కొంటున్నారు. ఏజెంట్లు, ఏటీఎస్ నిర్వాహకుల తంతంగంతో కాలం చెల్లిన, ఫిట్‌గా లేని వాహనాలు రోడ్లపైకి వస్తే జరిగే నష్టానికి ఎవరు బాధ్యులని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై ఏటీఎస్ నిర్వాహకుడు నాగార్జున రెడ్డి వివరణ కోరగా.. ఆయన స్పందించారు. కేంద్రంలో ఎలాంటి అక్రమాలు జరగడం లేదన్నారు. అన్ని సక్రమంగా ఉంటేనే పాస్ చేస్తున్నామన్నారు. తమ పేరు చెప్పి కొంతమంది ఏజెంట్లు డబ్బులు తీసుకుంటుండొచ్చని చెప్పారు.

మహిళ ఆత్మహత్య


సుజాతమ్మ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్ల గ్రామానికి చెందిన సుజాతమ్మ (56) ఆత్మహత్య చేసుకుంది. కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె నొప్పి తీవ్రత భరించలేక ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సుజాతమ్మ కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

వృద్ధురాలిపై కుక్కల దాడి

రాయదుర్గం: స్థానిక భగత్‌సింగ్ కాలనీలో ఆదివారం వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. అదే కాలనీకి చెందిన 70 ఏళ్ల ఈశ్వరమ్మ ఆదివారం నడుచుకుంటూ వెళుతుండగా ఒక్కసారిగా పది కుక్కలు చుట్టుముట్టి ముప్పేట దాడి చేశాయి. కండలు బయటపడేలా పీకాయి. గమనించిన స్థానికులు కర్రలతో అదిలించినా ఒకటి తప్పితే మరొకటి వృద్ధురాలిపై దాడి చేయసాగాయి. దీంతో స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని కర్రలతో కుక్కలను బాది వృద్ధురాలిని కాపాడాడు. అప్పటికే తీవ్ర రక్తగాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్న వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించారు. కాగా, కాలనీలో వారం రోజుల క్రితం కుక్కల దాడిలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరింది.


అపస్మారక స్థితికి చేరుకున్న వృద్ధురాలు

చిన్నారులను బయటకు పంపాలంటే స్థానికులు భయపడే పరిస్థితి నెలకొంది. పట్టణంలో వీధి కుక్కల నివారణకు చర్యల చేపట్టాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

డబ్బు కోసం సొంత బిడ్డ విక్రయం!

- రెండేళ్ల క్రితం పెనుకొండలో బాలిక అదృశ్యం
- బంధువుపైనే అనుమానాలు
- చిన్నారి అదృశ్యంతో తనకు సంబంధం లేదని వెల్లడి
- ఆరు నెలల క్రితం తన సొంత బిడ్డనే అమ్ముకున్నట్లుగా బహిర్గతం


తన కుమార్తెను విక్రయించానని తెలుపుతున్న బాబ్జాన్

సోమందేపల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేని ఓ యువకుడు డబ్బు కోసం తన కుమార్తెనే విక్రయించాడు. ఆరు నెలల క్రితం ఈ ఘటన జరుగగా.. ఆదివారం వెలుగు చూసింది.

రెండేళ్ల క్రితం ఓ బాలిక అదృశ్యం..

పెనుకొండకు చెందిన ఖలీల్ కుమార్తె నాలుగేళ్ల వయసున్న సాఫియా 2023, జూన్ 12న కనిపించకుండా పోయింది. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకూ ఆచూకీ గుర్తించలేకపోయారు. అప్పటి నుంచి ఈ కేసు దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

నిలదీయడంతో ఆత్మహత్యాయత్నం..

శనివారం ఉదయం ఖలీల్ ఇంటికి సమీప బంధువు, అనంతపురానికి చెందిన బాబ్జాన్ వెళ్లాడు. అయితే గతంలో బాబ్జాన్ తన సొంత కుమార్తెను ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్న విషయం తెలుసుకున్న ఖలీల్ కుటుంబసభ్యులు అతన్ని గట్టిగా నిలదీశారు. తమ కుమార్తె సాఫియా అదృశ్యం వెనుక బాబ్జాన్ హస్తమున్నట్లుగా అనుమానాలు వ్యక్తం చేశారు. డబ్బు కోసం సాఫియాను కూడా అపహరించి విక్రయించావంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో మనస్తాపానికి గురైన బాబ్జాన్ నిద్రమాత్రలు మింగడంతో వెంటనే పెనుకొండలోని వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మీడియా ప్రతినిధులు ఆదివారం ఆస్పత్రికి చేరుకుని జరిగిన ఘటనపై బాబ్జాన్‌తో ఆరా తీశారు.

సొంత బిడ్డనే అమ్ముకున్నా..

కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆరు నెలల క్రితం తన సొంత కుమార్తెనే హిందూపురం ప్రాంతంలో విక్రయించినట్లు బాబ్జాన్ తెలిపాడు. ఇందుకు పెనుకొండలోని దర్గాపేటకు చెందిన ఓ మహిళ సహకరించిందన్నాడు. అయితే 2023లోనే సదరు మహిళ తనను సంప్రదించిందని, ఆ సమయంలో సాఫియాను అపహరించుకొస్తే విక్రయించగా వచ్చిన సొమ్మును పంచుకుందామని ఆమె తెలిపిందని గుర్తు చేశాడు. ఇందుకు అప్పట్లో తాను ఒప్పుకోలేదన్నాడు. అయితే డబ్బు అవసరం కావడంతో ఆరు నెలల క్రితం తన సొంత కుమార్తెను సదరు మహిళ ద్వారా విక్రయించిన మాట వాస్తవమని బహిర్గతం చేశాడు.

పక్కదారి పట్టిన విచారణ?

బాలిక మిస్సింగ్ కేసులో ఇప్పటి వరకూ ఎలాంటి పురోగతి సాధించని పెనుకొండ పోలీసులు తాజాగా వెలుగు చూసిన బాలిక విక్రయం కేసులో విచారణను సైతం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నట్లుగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాబ్జాన్ స్పష్టంగా తన కుమార్తెను విక్రయించినట్లుగా మీడియా, పోలీసుల సమక్షంలో అంగీకరించినా కేసు నమోదులో తాత్సారం చేస్తూ అనంతపురంలోని చైల్డ్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌కు సమాచారం అందించి చేతులు దులుపుకున్నారు. సమాచారం అందుకుని అనంతపురం నుంచి చైల్డ్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌కు చెందిన మహిళా ఏఎస్‌ఐ పెనుకొండలోని ఆస్పత్రికి చేరుకుని బాబ్జాన్‌తో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న దర్గాపేటకు చెందిన మహిళనూ విచారణ చేశారు. అనంతరం బాబ్జాన్ తన ఇష్టపూర్వకంగానే కుమార్తెను విక్రయించాడని, సాఫియా అదృశ్యమైన ఘటనలో అతని ప్రమేయం లేదని, అలాగే దర్గాపేటకు చెందిన మహిళ కూడా అలాంటి వ్యక్తి కాదని స్థానిక పోలీసులకు మహిళా ఏఎస్‌ఐ తెలిపి వెళ్లిపోయారు. తన కుమార్తెనే విక్రయించినట్లు మీడియా సమక్షంలో పోలీసులకు బహిర్గతం చేసిన బాబ్జాన్‌పై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరింత లోతుగా విచారణ చేపడితే సాఫియా అదృశ్యం వెనుక మిస్టరీ బయటపడే అవకాశముందని, ఆ దిశగా పోలీసులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దారి తప్పిన 'కూటమి' పాలన

- నత్తనడకన 'సూపర్ సిక్స్'
- కార్పొరేట్ కోసం పనిచేస్తున్న ప్రభుత్వం
- సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప ధ్వజం


'కార్పొరేట్లకు వరాలు- పేదలకు శాపాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నల్లప్ప తదితరులు

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన పూర్తిగా గాడి తప్పిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా సూపర్ సిక్స్ హామీల అమలు నత్తనడకన సాగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప విమర్శించారు. పేదోలు నివాసముండేందుకు రెండు సెంట్ల స్థలం ఇవ్వలేని సీఎం చంద్రబాబు.. కార్పొరేట్ కంపెనీలకు మాత్రం వేల ఎకరాలు దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యాలను ఎండగడుతూ 'కార్పొరేట్లకు వరాలు- పేదలకు శాపాలు' పేరుతో ముద్రించిన పుస్తకాన్ని సీపీఎం నేతలతో కలసి ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని పాలకులు తుంగలో తొక్కారని మండిపడ్డారు. రూ.3వేల నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఊసేలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయలేదన్నారు. మిర్చికి గిట్టుబాటు ధర లేకపోతే ధర పెంచి కొనుగోలు చేస్తామని చెప్పి మభ్య పెట్టారన్నారు. 19 నుంచి 50 ఏళ్ల వయసున్న ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు అందజేసే పథకమూ అమలుకు నోచుకోలేదన్నారు. ఏడాది పాలనలో వీరికి రూ.32,400 కోట్లు ఎగనామం పెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు. తల్లికి వందనం పేరుతో రూ.10 వేల కోట్లు ఇచ్చామంటూ చెబుతున్న ప్రభుత్వ పెద్దలు ఈ ఏడాది రూ.15,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజల నెత్తిన మోపిందన్నారు. జిల్లాలో హెచ్చెల్సీ ఆధునీకీకరణ పనులు చేపట్టలేదన్నారు. హంద్రీ–నీవా పిల్ల కాలువలు తవ్వకుండా లైనింగ్ పనులు చేపట్టి రైతాంగానికి తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, చంద్రశేఖరరెడ్డి, రామిరెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

తల్లికి వందనం.. 'అవుట్'

- స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ల పిల్లలకు కట్

నల్లమాడ: అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన స్వచ్ఛ భారత్ కో ఆర్డినేటర్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం వర్తించకుండా కోత విధించింది. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చేపట్టే కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రభుత్వం మండలానికి ఒకరు చొప్పున కో ఆర్డినేటర్లను నియమించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలకు గాను 55 మండలాల్లో స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్లు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ,18,500 వేతనం నిర్ణయించగా,, కటింగ్‌లు పోను రూ.11 వేలు చేతికి అందుతున్నట్లు తెలుస్తోంది. ఆ వేతనం కూడా ఇప్పటికి ఎనిమిది నెలల నుంచి అందలేదు. ఇటువంటి పరిస్థితుల్లో తమ పిల్లలకు 'తల్లికి వందనం' సాయం అందకుండా ప్రభుత్వం కోత విధించడంతో కో ఆర్డినేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరకొర జీతంతో అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న తమకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతున్నారు.

ఇంకా వెల్లడికాని ఏడీఏల బదిలీల జాబితా

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ ఈ నెల 9న ముగిసినట్లు ప్రకటించినా... ఇప్పటికీ వ్యవసాయశాఖ ఏడీఏల జాబితా వెల్లడికాకపోవడం విశేషం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది బదిలీల ప్రక్రియ ఓ ప్రసహనంలా మారింది. నిబంధనలు బేఖాతరు చేస్తూ పలుకుబడి, డబ్బు ఖర్చు చేసిన వారు తాము కోరుకున్న స్థానాలు దక్కించుకున్నట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్ని శాఖల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో ఉద్యోగ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయశాఖలో మొదటిసారి విడుదలైన ఏఓల జాబితాపే పక్కన పెట్టి రెండు రోజుల తర్వాత మరోజాబితా విడుదల చేశారు. అలాగే ఏడీఏలకు సంబంధించి కూడా మొదటి జాబితా విడుదల చేసినట్టే చేసి వెనక్కి తీసుకున్నారు. వారం పూర్తి కావస్తున్న ఏడీఏల జాబితాకు మోక్షం కలగలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో 9 మంది ఏడీఏలు బదిలీ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. మొదటి జాబితా ప్రకారం కొనసాగిస్తారా లేదా మార్పులు చేర్పులు ఉంటాయా అనే దానిపై ప్రస్తుతం వ్యవసాయశాఖలో చర్చనీయాంశమైంది.

- పట్టుపరిశ్రమ అధికారులు (ఎస్‌ఓ) బదిలీలు, అలాగే పశుశాఖలో డీడీ, ఏడీలు, వీఏఎస్‌ల బదిలీలు జరిగిన తీరు తెన్నులపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధుల పలుకుబడి, సిఫారసులు, అసోసియేషన్ల రాష్ట్ర నాయకులు సిఫారసులు, ఇన్‌పుట్ డీలర్ల పైరవీల పాటు పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చించి కొందరు ఉద్యోగులు కోరుకున్న తాము ప్రాంతానికి బదిలీ అయినట్లుగా జోరుగా ప్రచారం సాగుతోంది.

వారి సంకల్పం అ'పూర్వ'ం

చూపులతో పుట్టి.. మాటలతో మొదలయ్యేది కాదు స్నేహం..మనసులో పుట్టి.. మట్టిలో కలిసేంత వరకూ తోడుండేదే అసలైన స్నేహం. ఎందరో కవులు.. ఇంకెందరో స్నేహితులు.. స్నేహబంధాన్ని, అందులోని మాధుర్యాన్ని ఎన్నో రకాలుగా నిర్వచించి ఉండవచ్చు. అయితే స్నేహం ఏ నిర్వచనానికి అందనంత గొప్పది. ఏ బంధానికీ సాటిరానంత ఉన్నతమైనదని నిరూపించారు తాడిపత్రి ప్రాంతానికి చెందిన పూర్వ విద్యార్థులు. తమలో ఒకరికి కలిగిన కష్టం, నష్టం... తమందరిదిగా భావించారు. బాధపడిపోయారు. దాన్నుంచి స్నేహితుడి కుటుంబాన్ని బయటపడేసేందుకు ఏకమయ్యారు.

- కష్టాల్లో ఉన్న మిత్రుడి కుటుంబానికి బాసట


డిపాజిట్ బాండ్ పేపర్‌ను కొండయ్య భార్య రాజ్యలక్ష్మికి అందిస్తున్న పూర్వ విద్యార్థులు (చిత్రంలో) కొండయ్య తల్లి, పిల్లలు


తాడిపత్రి టౌన్/పుట్లూరు: ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగారు. తాడిపత్రిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004–07 విద్యాసంవత్సరంలో (ఎంపీసీ) చదువుకుంటున్న సమయంలో స్నేహితులుగా మారారు. చదువుల అనంతరం వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థిరపడ్డారు. అయితే 18 ఏళ్ల తర్వాత తమ స్నేహితులందరినీ కలుసుకోవాలని పూర్వవిద్యార్థులు నాగరంగయ్య, ప్రతాప్ భావించారు. అనుకున్నదే తడవుగా స్నేహితుల గురించి ఆరా తీస్తూ 42 మందిలో ఇప్పటి వరకూ 15 మందితో మాట్లాడి గెట్ టు గెదర్ ఏర్పాటుకు సన్నాహకాలు మొదలు పెట్టారు. మిగిలిన వారి గురించి ఆరా తీస్తున్నారు. ఇక్కడి వరకూ అంతా బాగున్నా.. చదువుకుంటున్న సమయంలో తమను ఎంతో నవ్వించే కొండయ్య ఆచూకీ ఒక్కటే దొరకలేదు. కేవలం ఊరి పేరు మాత్రమే తెలుసు.

పూట గడవని స్థితిలో స్నేహితుడి కుటుంబం

కొండయ్య స్వగ్రామం పుట్లూరు మండలం అరకటివేముల కావడంతో ఆ గ్రామానికి చెందిన కొందరితో కొండయ్య గురించి నాగరంగయ్య, ప్రతాప్ ఆరా తీశారు. 'అయ్యో! ఇంకెక్కడి కొండయ్య.. ఏడాది క్రితం గుండె పోటుతో చనిపోయాడు కదబ్బా!!' అంటూ గ్రామస్తులు తెలపడంతో ఒక్కసారిగా స్నేహితులు కంగుతిన్నారు. ఆస్తిపాస్తులు ఏమీ లేని కొండయ్యకు ముగ్గురు పిల్లలు ఉన్నారని... తల్లి అంకాలమ్మ, భార్య రాజ్యలక్ష్మి కూలి పనులతో అతి కష్టంపై కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారని తెలుసుకున్న నాగరంగయ్య, ప్రతాప్ విషయాన్ని వెంటనే మిగిలిన స్నేహితులందరికీ చేరవేశారు. అందరి హృదయాలు బరువెక్కాయి. సంతోషంగా గడపడానికి ఎప్పుడైనా కలుసుకోవచ్చునని, అంతకు ముందు కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని అందరూ ఏకాభిప్రాయానికి రావడంతో గెట్ టు గెదర్ కోసం సిద్ధంగా ఉంచుకున్న రూ.1.25 లక్షలను కొండయ్య కుమార్తె సాహితి పేరున పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు. నెలకు సరిపడ సరుకులు తీసుకుని ఆదివారం అరకటివేములకు చేరుకుని కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమతో పాటు తీసుకెళ్లిన సరుకులు, డిపాజిట్ బాండ్‌ను అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఒకరి కష్టాన్ని అందరిదిగా భావించి స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకున్న తీరును అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జయచంద్ర, ప్రతాప్ రెడ్డి, నాగరంగయ్య, ఓబులేసు, వెంకట్, మల్లికార్జున, నరేంద్ర, రమేష్, కులశేఖర్, లక్ష్మీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మేల్కొనకపోతే 'అనంత' ఎడారే

- ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ మల్లారెడ్డి

అనంతపురం: వర్షా భావ పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువును అధిగమించడానికి ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణే శరణ్యమని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించే ప్రపంచ కరువులు, ఎడారీకరణ నివారణ దినం కార్యాచరణపై ఆదివారం అనంతపురంలోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 17న తలపెట్టిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 500 మంది రైతులతో స్ఫూర్తిదాయక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నేల, నీరు, వాతావరణం కలుషితమై.. జీవవైవిధ్యానికి పెనుముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మేల్కొనకపోతే ఉమ్మడి అనంతపురం జిల్లా ఎడారిగా మారే ప్రమాదముందన్నారు. కరువులు, ఎడారీకరణ, వాతావరణంలో పెను మార్పుల నుంచి వ్యవసాయం మనుగడ సాగించాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమన్నారు. గత 10, 15 సంవత్సరాలుగా వ్యవసాయంలో రసాయనాల వినియోగం అధికం కావడంతో వాటిని వినియోగిస్తున్న మానవుడికి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించేలా అవగాహన కల్పించడమే తమ ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష

బెళుగుప్ప: స్థానిక శాంతిధామంలో వెలసిన అవధూత ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉట్ల పరుషను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. ఉట్ల మాను ఎక్కేందుకు బెళుగుప్ప యువకులు పోటీ పడ్డారు. ముగింపు రోజు కావడంతో ఉత్సవాల్లో ఎర్రితాత స్వామిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు.


ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటండి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించాలని డీఆర్‌ఓ ఎ.మలోల పిలుపునిచ్చారు. సోమవారం నుంచి ఈనెల 18 వరకు రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలు విజయవాడలో జరగనున్నాయి. జిల్లా స్థాయిలో జూనియర్, యంగర్, సీనియర్ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన 28 విద్యార్థులు ఆదివారం బస్సులో విజయవాడకు బయలుదేరి వెళ్లారు. కలెక్టరేట్ నుంచి బయలుదేరిన బృందం బస్సును డీఆర్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, జిల్లా ఆయుష్ సీనియర్ మెడికల్ అధికారి భాస్కర్‌రావు, తహసీల్దార్ హరికుమార్, నారాయణస్వామి, ఆర్‌ఐ ఆనంద్, చిన్నహోతూరు పాఠశాల ఉపాధ్యాయుడు వెంకట్, ఆయుష్ శాఖ యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి ఆద్యుడు శ్రీకృష్ణుడు



కేఎం కాలనీలో భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కేఎం కాలనీలో భగవద్గీత, ఇతర గ్రంథాలపై ప్రచారం చేశారు. ఇందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున నేతృత్వంలో పలువురు భక్తులు శ్రీకృష్ణుడిని జగద్గురువుగా ఎందుకు చెప్పుకోవాల్సి వస్తోందో వివరించారు. గురువు అంటే గుణాతీతుడని.. ఆది మధ్యాంత రహితుడైన శ్రీకృష్ణుడు మాత్రమే పురాణేతిహాసాల్లో అలాంటి విశిష్టమైన లక్షణాలున్న మహోన్నత వ్యక్తిగా కనిపిస్తాడన్నారు. ఆధునిక కాలంలో ఎంతో మందిని గురువులు, జగద్గురువులుగా పిలుచుకుంటున్నా గతి తప్పిన జగతికి సద్గతులు కూర్చిన శ్రీకృష్ణుడి గురించి గురుపౌర్ణమి రోజు తలచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివసాయి, నాగేశ్వరి, నారాయణ రెడ్డి, సోమేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహమ్మద్ దీవాన్ ఖాద్రీ ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న హజరత్ సయ్యద్ కాదర్ మహమ్మద్ దీవాన్ ఖాద్రీ, బారా ఇమామ్ ఉరుసు ఆదివారం ముగిసింది. ముతవల్లి నూర్ మహమ్మద్ (ముజావర్) ఆధ్వర్యంలో చివరి రోజు దర్గాపై జెండాలు కట్టారు. రెండు సమాధులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూదేకుల, ముస్లింలు చదివింపులు, ప్రార్థనలు చేయించారు. మధ్యాహ్నం జయారత్ (కందూరి) కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా తరలివచ్చిన ముస్లింలు ప్రార్థనలు చేశారు. వేడుకలకు వచ్చిన భక్తులందరికీ కందూరి ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అనంతపురం: నగరంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. మూడో పట్టణ సీఐ కె.శాంతిలాల్ తెలిపిన మేరకు... శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన మబ్బు రామకృష్ణ (49) మూడేళ్ల క్రితం తన భార్య శివమ్మతో కలసి ఆమె స్వగ్రామమైన ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలో స్థిరపడ్డాడు. అనంతపురంలోని పీవీకేకే కళాశాలలో వాచ్‌మెన్‌గా రామకృష్ణ, కూలి పనులతో శివమ్మ కుటుంబాన్ని పోషించుకునే వారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కాగా, కుమార్తెలిద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కుమార్తె శిల్ప విషపూరిత ద్రావకం తాగి పామిడిలోని సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రామకృష్ణ, శివమ్మ.. శనివారం కుమార్తెను చూసేందుకు వెళ్లారు. రాత్రి తనకు డ్యూటీ ఉందని రామకృష్ణ అనంతపురానికి వచ్చి నేరుగా ఇందిరానగర్‌లో ఉన్న స్నేహితుడు మహబూబ్‌బాషా ఇంటికెళ్లాడు. అనంతరం ఇద్దరూ కలసి మద్యం సేవించారు. రాత్రి మహబూబ్ బాషా ఇంటి బయట నిద్రించిన రామకృష్ణ ఆదివారం ఉదయానికే మృతి కనిపించడంతో విషయాన్ని శివమ్మకు మహబూబ్‌బాషా ఫోన్ చేసి తెలిపాడు. శివమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సేవకు దూరం.. రైతుకు శాపం





రాప్తాడు మండలం హంపాపురంలోని రైతు సేవా కేంద్రం

- రేషనలైజేషన్ పేరుతో రైతు సేవా కేంద్రాల కుదింపు
- సిబ్బందిని ఇతర శాఖలకు పంపేందుకు చర్యలు
- ఆర్‌ఎస్‌కేలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర
- ఇప్పటికే దూరమవుతున్న సేవలు

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ హయాంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) కూటమి ప్రభుత్వ తీరుతో త్వరలో కనుమరుగు కానున్నాయి. ఉన్న ఊళ్లోనే రైతులకు అన్ని రకాల సేవలు అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీటిని ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పంటల సాగుకు అవసరమైన అన్ని రకాలు సేవలు అన్నదాతకు సకాలంలో అందేవి. పంటల సాగులో సూచనలు, సలహాలు, అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకునేవారు. పండిన పంటలకు కూడా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. తద్వారా రైతులకు ఎంతో మేలు జరిగేది. ఇటీవల కాలంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చి.. ఈ వ్యవస్థనే నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతోంది. రేషనలైజేషన్ పేరుతో కేంద్రాలను కుదించేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఉన్న సిబ్బందిని సర్దుబాటు పేరుతో ఇతర సంస్థలకు బదలాయించేందుకు చర్యలు తీసుకుంటోంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో రైతులు ఇబ్బందులు పడతారు.

సేవలకు బ్రేక్..

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సాగుకు అవసరమైన రాయితీ విత్తనాల పంపిణీ ఆగిపోయింది. సబ్సిడీపై ఎరువులను నామమాత్రంగా అందించారు. అది కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా కాకుండా సహకార సంఘాల ద్వారా విక్రయాలను చేపట్టారు. ఈ ఏడాది సాగులో చివరిలో యూరియా అందక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రెండు వేల ఎకరాలు సాగులో ఉండే గ్రామాల్లో మాత్రమే రైతు సేవా కేంద్రాలు కొనసాగించాలని నిర్ణయించి కుదింపు అమలుకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు నివేదికలు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే నియోజకవర్గంలో చాలా రైతు సేవా కేంద్రాలు తగ్గిపోనున్నాయి.

రాప్తాడులో 13, ఆత్మకూరులో 10, అనంతపురం రూరల్‌లో 17, కనగానపల్లిలో 10, రామగిరిలో 11, చెన్నేకొత్తపల్లిలో 13 కలిపి మొత్తం 74 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 74 మంది వీఏఏలుగా విధులు నిర్వహిస్తున్నారు. రేషనలైజేషన్ పేరుతో ఇందులో సగం మందిని ఇతర శాఖలకు పంపించేస్తే మిగిలిన సిబ్బందితో రైతులకు సేవలు అందించడం కష్టంగా మారనుంది.

ఐదేళ్లూ ఇబ్బంది పడలేదు



వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయం పండగలా మరింది. గ్రామాల్లోనే ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడం ద్వారా విత్తనం దగ్గర నుంచి ఎరువుల వరకు అన్నీ అందుబాటులో లభించేవి. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి స్థానికంగానే కొనుగోలు చేసేవారు. ఈ ఐదేళ్లు మాకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. అన్నదాతకు అండగా నిలిచిన రైతు సేవా కేంద్రాలను కుదిస్తే వ్యవసాయం దండగ అనే భావన మళ్లీ కలుగుతుంది. రైతు సేవా కేంద్రాలను కూటమి ప్రభుత్వం కొనసాగించి అన్నదాతను ఆదుకోవాలి.

– తలారి సింగారప్ప, హంపాపురం, రాప్తాడు మండలం

ఊళ్లోనే సేవలు అందేవి



గతంలో రైతు భరోసా కేంద్రాల వల్ల ప్రయోజనం పొందాం. విత్తనాలు, ఎరువులు, సాగుకు అవసరమైన అన్ని సేవలు ఊళ్లోనే అందేవి. వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా అందుబాటులో ఉండి పంటలకు ఏమైనా తెగుళ్ల, పురుగు ఆశించిందని చెప్పిన వెంటనే పొలానికి వచ్చి చూసేవారు. అలాంటి కేంద్రాలను తగ్గించడం సరికాదు. ఇప్పుడు పురుగు మందులు, విత్తనాలు కొనుక్కోవాలంటే దుకాణాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. విత్తనాల నాణ్యత తెలుసుకోవడం కష్టంగా మారుతుంది.

– నారప రెడ్డి, పుల్లలరేవు, రాప్తాడు మండలం

వివరాలు..

మండలం	రైతు సేవా కేంద్రాలు
రాప్తాడు	13
ఆత్మకూరు	10
అనంతపురం రూరల్	17
రామగిరి	11
చెన్నేకొత్తపల్లి	13
కనగానపల్లి	10

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్

అనంతపురం అర్బన్: ప్రజలకు వైద్య సేవలందిస్తున్న 104 సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ మినిమమ్ టైమ్ స్కేల్, కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో 104 సర్వీస్ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శివకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేంద్ర కుమార్‌తో పాటు సంఘం గౌరవాధ్యక్షుడు ఏజీ రాజమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ నాయుడు మాట్లాడారు. 104 సర్వీస్ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆరబిందో యాజమాన్య కాలపరిమితి ముగిసిందన్నారు. ఆ సంస్థ రెండు నెలల వేతనం ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయి వేతనాలు, ఈఎల్, గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. ప్రస్తుతం 104 సర్వీసులను నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యమూ కూడా ఉద్యోగులకు ప్రతి నెలా వేతనం చెల్లించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, నాయకులు డీకే మల్లికార్జున, ఓబుశేసు, మానస, మహమ్మద్ పీర, షబానాబాను, రుద్ర, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న రాజారెడ్డి

అనంతపురం అర్బన్: ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకాన్ని ప్రభుత్వం అమలు చేసి రూ.15 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సంఘం ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో అధికంగా ఉన్న ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆటోలపై పోలీసులు, ఆర్‌టీఓ అధికారులు జరిమానాలు విధిస్తూ కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన వాహన మిత్ర పథకాన్ని ఈ ప్రభుత్వం అమలు చేసి ప్రతి కార్మికుడికి రూ.15 వేలు ఇవ్వాలన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సమస్యలను విస్మరిస్తున్నాయన్నారు. వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించేందుకు ఏఐటీయూసీ సిద్ధమవుతోందన్నారు. ఆటో స్టాండ్ల సమావేశాల అనంతరం సెప్టెంబరులో ఆటో యూనియన్ జిల్లా మహాసభలో నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణా నాయక్, నాయకులు దుర్గాప్రసాద్, రమేష్, నాగరాజు, నరసింహ, రఘు, దాదు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ ఆశయ సాధనకు కృషి



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: మహాకవి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజానాట్య మండలి, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పలు కాలనీల్లో శ్రీశ్రీ 42వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు, కష్టజీవులు, పేదలు, మహిళలు, విద్యార్థుల సమస్యలు, సమాజం అభివృద్ధి వైపు శ్రీశ్రీ రచనలు, గేయాలు రాశారన్నారు. మహాప్రస్థానం, మరోప్రపంచం, ప్రజారాజ్యం, అగ్నిజ్వాల, ఉక్కుపిడికిలి, తదితర సినిమా పాటలు, ఎన్నో చైతన్యవంత గీతాలు రాశారన్నారు. అలాంటి మహానుభావుల ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకుడు శ్రీనివాసులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు. నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్‌రెడ్డి, పరమేష్, మహేష్, పుల్లన్న, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ఇప్పించాలి

చెన్నేకొత్తపల్లి: విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లను తమ తల్లిదండ్రుల నుంచి ఇప్పించాలని అఖిల, నరేంద్ర దంపతులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. వివరాలు.. గుత్తికి చెందిన అఖిల, చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన నరేంద్ర పుట్టుకతోనే మూగ, చెవిటి వారు. వీరు ఆర్డీటీ సంస్థ సహకారంతో బుక్కరాయసముద్రంలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. ప్రేమ వివాహం అనంతరం ఇద్దరు బెంగళూరులో ప్రైవేట్ జాబ్ చేసుకుంటున్నారు. అఖిల కులాంతర వివాహం చేసుకుందనే కారణంలో బంధువులు ఇద్దరి విద్యార్హత సర్టిఫికెట్లను తీసుకెళ్లారు. అధికారులు స్పందించి సర్టిఫికెట్లు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అఖిల, నరేంద్ర దంపతులు కోరుతున్నారు.



పంపనూరు వద్ద విత్తనాలు విత్తుతున్న రైతులు

సిరులు పండాలి



విత్తన శుద్ధి చేస్తున్న దృశ్యం

తొలకరి పలకరించడంతో అన్నదాతలు ఉత్సాహంగా పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు పదును కావడంతో ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు ఆదివారం విత్తు నాటే పనిలో నిమగ్నమయ్యారు. కాగా.. ఆత్మకూరు మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో వేరుశనగ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మరి కొంత మంది రైతులు ప్రస్తుతం కురిసిన వర్షాలకు పొలాల్లో దుక్కులు ప్రారంభించారు.

– ఆత్మకూరు:

డివైడర్ ఎక్కిన ఆర్టీసీ బస్సు



కడప నుంచి అనంతపురానికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఆదివారం రాత్రి ప్రమాదానికి గురైంది. నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో వస్తుండగా.. ఎదురుగా వచ్చిన లారీని తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి డివైడర్ ఎక్కింది. ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు.

– అనంతపురం:



క్షుద్రపూజల కలకలం



ఇంటి ఎదుట క్షుద్రపూజలు చేసిన దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని 60వ అడుగుల రోడ్డులో నివాసముంటున్న మాజీ కౌన్సిలర్ రామచంద్ర ఇంటి ఎదుట క్షుద్ర పూజల ఘటన కలకలం రేపింది. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం ఉదయాన్నే 5.30 గంటలకు ఆయన నిద్ర లేచి ఇంటి బయట చూడగా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. ముగ్గులు వేసి పసుపు, కుంకుమ చల్లడంతోపాటు టెంకాయ, తయారు చేసిన బొమ్మ చేతులతో పాటు చెప్పులు వేసి పూజలు చేసినట్లు గుర్తించాడు. తాను గత కొంత కాలంగా పట్టణంలోని బళ్లారి చౌరస్తాలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన ఓ వ్యక్తిపై పోరాటాలు చేస్తున్నానన్నాడు. దీంతో ఇంటి సమీపంలోని తనకు గిట్టని కొందరి సాయం తీసుకుని ఈ పనికి ఒడిగట్టినట్లు ఆయన ఆరోపించాడు. ఈ విషయమై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నాడు.

హంద్రీ-నీవా కాలువలోకి టిప్పర్ బోల్తా

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం గ్రామ సమీపంలో ఉన్న హంద్రీ–నీవా కాలువలోకి ఆదివారం టిప్పర్ దూసుకెళ్లింది. హంద్రీ–నీవా కాలువ విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో కాలువ మట్టిని తరలిస్తున్న టిప్పర్ కాలువ పక్కన ప్రయాణిస్తూ.. అదుపుతప్పి కాలువలోకి బోల్తా పడింది. టిప్పర్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి



మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం కల్చరల్: గానగాంధర్వుడు ఎస్పీ బాలు వంటి సంగీత దిగ్గజం మళ్లీ పుట్టబోరని వక్తలు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక లలిత కళాపరిషత్తులో చంద్ర సినీ ఆర్కెస్ట్రా వారి ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి వేడుకలు నిర్వహించారు. అనంత గాయనీ గాయకులు ఆ పాత మధురాలతో స్వరనీరాజనాలు అర్పించారు. డీఈఓ మలోల, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకులు పాలసముద్రం నాగరాజు, నాగిస్ ప్రసాద్, ఆచార్య సుధాకరబాబు, నిర్వాహకులు తలారి శ్రీనివాసులు, రాజేశ్వరి తదితరులు బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలు సినీరంగానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పలువురు గాయనీ గాయకులు ఆలపించిన పాటలు అలరించాయి. చివరగా కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో ఎల్కేపీ కార్యవర్గ సభ్యులతో పాటూ వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



వి. ఇంద్రసేనా రెడ్డి (ఫైల్)

అనంతపురం: నెల రోజుల నుంచి తన కుమారుడు కనిపించడం లేదని అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. వివరాలు.. రుద్రంపేటలో నివాసం ఉన్న శివరామిరెడ్డి కుమారుడు వి.ఇంద్రసేనా రెడ్డి (35) భార్యతో విడిపోయాడు. మనశ్శాంతి కరువై మద్యానికి బానిసయ్యాడు. ఐదు రోజులు, పది రోజులకు ఒకసారి ఇంటికి వచ్చి వెళ్లేవాడు. గత నెల 16వ తేదీ ఉదయం 8 గంటలకు ఇంట్లో టిఫిన్ చేసి బయటకు వెళ్లిపోయాడు. ఇప్పటి దాకా తిరిగి రాలేదు. తండ్రి శివరామిరెడ్డి బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

అనంతపురం: నారాయణపురంలో ఉన్న మసీద్ ఉస్మాన్ ఘని ముతవల్లీ ఫయాజ్ అనే వ్యక్తి తన ఇంట్లో పనిచేసే మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడటం దారుణమని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. మానవ మృగంలా వ్యవహరించిన ఫయాజ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం సమైక్య వేదిక జాయింట్ సెక్రెటరీ అల్లా బకాష్, మహమ్మద్ అన్వర్, మహిళా గౌరవ అధ్యక్షురాలు మక్బూల్ ఖాన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ డిస్కో బాబు, అధికార ప్రతినిధి షేక్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

22న సాహితీ ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయం వేదికగా ఈ నెల 22న జాతీయ శతాధిక కవి సమ్మేళనం జరుగుతుందని లేపాక్షి ఫౌండేషన్ నిర్వాహకులు పొట్లూరి హరికృష్ణ, వడ్డీ సుధాకర్, అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ.. ఆసక్తి కల్గిన కవులు, కళాకారులు, కవయిత్రులు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, అందరికీ మధ్యాహ్న భోజన వసతి ఉంటుందని పేర్కొన్నారు. సాహిత్యాభివృద్ధి, సామాజికాభివృద్ధి సమాంతర లక్ష్యంగా సాగే కవి సమ్మేళనం వివరాలకు 90521 02042, 95733 60881 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం..

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. అలాగే మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం అన్నదానం చేశారు.

వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహం అధికారి శంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 3వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8008633290, 8919254720 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.